




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 10-4-2025

సంపుటి: 21 సంచిక: 14

పేజీలు: 8 వెల: రూ.1



# అక్రమాల అభ్యాసన!

SAMAGRA SHIKSHA ABHIYAN

బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొందరు అధికారుల అక్రమ సంపాదన పెంచుకునేందుకు ఉపయోగపడ్డాయి. రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాలల్లో బోధనను మెరుగుపరచి విద్యార్థుల గ్రహణ శక్తిని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో తలపెట్టిన పాల్(పీఏఎల్) ల్యాబ్‌ల ఏర్పా టు ప్రక్రియ పక్కదారి పట్టిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటికి సంబంధిం చిన మెటీరియల్ కొనుగోళ్ల నిబంధనల ను కాలరాసి కేంద్రీకృత కొనుగోళ్ల ద్వారా కాసులు వెనుకేసు కుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఆ విధంగా కమీషన్లు దండుకుని నాసిరకం మెటీరియల్‌ను పాఠశాలలకు అంటగడుతున్నారంటు న్నారు.


డి.వి.రమణ,
సత్యం ప్రత్యేక ప్రతినిధి


రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపరచడానికి వీలుగా పాల్ ల్యాబ్‌లు.. అంటే వ్యక్తిగత అనుకూల అభ్యాసన (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని 2019లోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని దశలవారీగా అమలు చేస్తోంది. ప్రధానంగా ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో ప్రత్యేక ల్యాబ్‌ల ద్వారా అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపరచాలని నిర్ణయించింది. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 524 పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా సత్ఫలితాలు వస్తుండటంతో మరికొన్ని పాఠశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని సమగ్రశిక్ష విభాగం ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ దఫా రాష్ట్రంలో ఉన్న 700 రెసిడెన్షియల్ పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ పాఠశాలలను ఎంపిక చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులతోపాటు బాలికలకు మెరుగైన అభ్యాసన సౌకర్యాలు అందుబాటులో తేవాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యం ఉన్నతమైనదే అయినా దాని అమల్లోనే అక్రమాలకు బీజాలు పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



PROCEEDINGS OF THE STATE PROJECT DIRECTOR
SAMAGRA SHIKSHA, ANDHRA PRADESH, AMARAVATI
Present: Sri B.Srinivasa Rao,I.A.S

Rc.No:APSS-20021/11/2024/MIS-SEC-SSA, Date:27-01-2025

| | |
|---|---|
| Sub: | Samagra Shiksha, AP – Quality Initiatives– Implementation of PAL in the state – establishment of PAL lab in new 700 residential schools-PAL Lab setup-certain instructions - issued - Regarding. |
| Read: | 1. MoU dt.15.11.2024 of ConveGenius Edu solutions Pvt Ltd, Noida, U.P.<br>2. Proceedings Rc.No.SS/20021/11/2024-MIS-SSA-1, dated 23-01-2025 of the State Project Director, Samagra Shiksha, A.P.<br>3. Proceedings Rc.No.SS/20021/11/2024-MIS-SSA-2, dated 23-01-2025 of the State Project Director, Samagra Shiksha, A.P. |

***

### మార్గదర్శకాలు పక్కాగా ఉన్నా..

పాల్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సమగ్రశిక్ష ఉన్నతాధికారులు మార్గదర్శకాలు, నిబంధనలు పక్కాగానే

- మిగతా 4లో


-పాల్ ల్యాబ్స్ ఏర్పాటులో కాసుల వేట

-మెటీరియల్ కొనుగోళ్లలో కొందరు పెద్దల చేతివాటం

-జిల్లా కేంద్రంలోని ఓ చిన్న షాపునకు భారీ బేరం

-నాసిరకం.. అది కూడా తక్కువ సామగ్రితో సర్దుబాటు

-ఈ వ్యవహారంలో కమీషన్లు చేతులు మారాయని ఆరోపణలు



In addition to the above, the following branded items should purchase for electrification fixture extensions and plug points for PAL lab where it is necessary and give instructions to the Head Masters/Principals on purchase the needed electrical items in the school. If any Computer lab is already







• ఎడిటోరియల్

# భద్రాద్రి రామయ్యకే విభజన సెగ

భద్రాచలం.. సీతారాములు నడయాడిన నేల. తెలంగాణలో యాదగిరి గుట్ట, వేములవాడలతో సమానమైన ఆధ్యాత్మిక క్షేత్రం. ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజున పాలకులు సీతారాముల పాదాక్రాంతమవుతారు. పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి జగదభిరాముడి కల్యాణాన్ని తిలకించి పులకిస్తారు. అటువంటి భద్రాచలం భౌగోళికంగా తెలంగాణలో తూర్పు దిక్కులో చివరి భాగాన ఉంటుంది. పావన గోదావరి సాక్షిగా భద్రగిరిపై వెలిసిన సీతారాములు నిత్యపూజలు అందుకుంటుంటారు. క్షేత్ర ప్రాశస్త్యం వల్లే రామజన్మభూమి అయోధ్యతో సరిసమానంగా భద్రాచల క్షేత్రం దక్షిణ అయోధ్యగా పేరుపొందింది. ఏటా 40 లక్షల మంది భక్తులు భద్రాద్రి రామయ్యను దర్శించుకుంటుంటే ఆలయానికి రూ. 40కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. భద్రాచల ఆధ్యాత్మిక వైభవం ప్రపంచ ప్రసిద్ధం. కానీ రాష్ట్ర విభజన రాజకీయాల్లో పాలకులు భద్రాద్రిని పావుగా వాడుకున్నారు. ఈ క్షేత్రానికి తీవ్ర అన్యాయం చేశారు. ఉమ్మడి ఏపీ విభజన ద్వారా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 2014లో జరిగిన ఎన్నికలు జరిగాయి. ఏపీలో టీడీపీ, తెలంగాణలో టీఆర్ఎస్ (ఇప్పటి బీఆర్ఎస్) అధికారంలోకి వచ్చాయి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం పోలవరం ముంపు మండలాల పేరిట ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు మండలాలను పూర్తిగా, బూర్గంపాడు, భద్రాచలంలోని కొన్ని గ్రామాలను తెలంగాణ నుంచి తప్పించి ఏపీలో విలీనం చేయాలని నిర్దేశించారు. ఆ మేరకు అప్పట్లో టీడీపీ భాగస్వామిగా ఉన్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వేలేరుపాడు, కుక్కునూరు, కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు మండలాలను పూర్తిగా, బూర్గంపాడు మండలంలోని కొన్ని గ్రామాలను, భద్రాచలం మండలంలోని భద్రాచలం రెవెన్యూ పంచాయతీ మినహా మిగతా గ్రామాలను ఏపీలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసనలు చెలరేగినా ఫలితం లేకపోయింది. విలీన ప్రక్రియలో భాగమంటూ భద్రాచలం మండల పరిధిలోని ఐదు ఊళ్లను ఏపీలో కలపడం భద్రాద్రి రామయ్య క్షేత్రానికి తీరని నష్టం కలిగించింది. భద్రాచలాన్ని ఆనుకొని ఉండే ఏటపాక, గుండాల, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం పంచాయతీలను ఏపీలో కలపడంతో భద్రాచలం మండలం చిన్నపాటి పంచాయతీ స్థాయికి కుచించుకుపోయింది. దీనివల్ల భద్రాద్రి క్షేత్రంలో అభివృద్ధి చర్యలకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి. టెంపుల్ టౌన్‌గా విస్తరించాలన్న ప్రణాళికలు ఉన్నా భూమి అందుబాటులో లేకుండా పోయింది. భద్రాచల ఆలయానికి చెందిన 900 ఎకరాలు పురుషోత్తపట్నంలో ఉన్నాయి. ఇప్పుడీ గ్రామం ఏపీలో చేరిపోయింది. ఇక్కడ ఏవైనా నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతులు, పరిధుల విషయంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. పైగా ఏపీ అధికారులు పట్టించుకోకపోతుండటంతో రామాలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. భద్రాచలం పట్టణం రెండు వేల ఎకరాల్లో విస్తరించి ఉండగా 80 వేల జనాభా ఉంది. పట్టణం చుట్టుపక్కల గ్రామాలు ఏపీలో కలవడంతో ప్రస్తుతం పట్టణంలో సత్రాల నిర్మాణానికి, పార్కుల ఏర్పాటుకు, వాహనాల పార్కింగ్‌కు, డంపింగ్ యార్డుకు చివరికి శ్మశానవాటికకు సైతం స్థలాల కొరత ఏర్పడింది. ప్రసిద్ధ క్షేత్రం కావడంతో భద్రాద్రిని విస్తరించాల్సిన అవసరం ఉంది. తాజాగా కేంద్రం రైల్వే లైన్ కూడా ప్రకటించింది. మరోవైపు కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు రాబోతోంది. కానీ ఆ స్థాయిలో క్షేత్రాన్ని అభివృద్ధి పరిచేందుకు అవకాశం లేకుండా పోయింది. గోదావరి వరదల నుంచి భద్రాద్రిని రక్షించేందుకు నదికి ఇరువైపులా కరకట్టలు కట్టాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఐదు పంచాయతీల మీదుగా దాన్ని నిర్మించాల్సి ఉండటంతో అనుమతులు అంత సులభంగా లభించే పరిస్థితి లేదు. అంతెందుకు రామాలయానికి అనుబంధంగా ఉండే పర్యాటక ప్రాంతాలైన పర్ణశాల, ఉష్ణగుండాల వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఏపీ గ్రామాల మీదుగా అడ్డంకులు దాటుకుంటూ వెళ్లాల్సిందే. వాస్తవానికి ఏపీలో ఉన్నారన్న మాటేగానీ, ఐదు పంచాయతీల ప్రజల బతుకుదెరువు అంతా భద్రాచలంతోనే ముడిపడి ఉంది. అందువల్ల తమను తిరిగి తెలంగాణలో కలపాలని కోరుతూ ఆ ఐదు పంచాయతీలు గతంలోనే ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేశాయి. అయితే ఏపీ ఉన్నతాధికారులు మాత్రం అది తమ పరిధిలో లేదని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందని సెలవిస్తున్నారు. విభజన సమస్యల పరిష్కారం పేరిట గత ఏడాది జూలైలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఐదూళ్ల సమస్య కూడా వారి చర్చల్లోకి వచ్చింది. కానీ పరిష్కారానికి మాత్రం నోచుకోలేదు. ఫలితంగా భద్రాద్రి క్షేత్రం పాలిట రాష్ట్ర విభజన ఒక శాపంగా మారింది.

## రక్తదాతలే నిజమైన సేవకులు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రక్తదాతలే నిజమైన సేవకులని, పదిమంది ప్రాణాలు కాపాడటం ఒక్క రక్తదాతకే సాధ్యమని ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ డాక్టర్ విశ్వక్సేన్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం మండలంలోని కేశవరావుపేట గ్రామంలో ఎచ్చెర్ల జనసేన నాయకులు పొందూరు ఉమామహేశ్వరరావు జన్మదినం సందర్భంగా గ్రామంలో చలివేంద్రంతోపాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వక్సేన్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి ఆలోచన చేసిన ఉమామహేశ్వరరావును అభినందించారు. రక్తదానం ఒక మహోత్తర కార్యక్రమమన్నారు. యువత అపోహాలు వీడి, రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు ఇండియన్ రెడ్‌క్రాస్ అందించిన బంగారుపతకంతోపాటు, ప్రశంసా పత్రాన్ని అందించారు. ఇందులో భాగంగా మదర్స్ హెల్పింగ్ సొసైటీ డా.పైడి ప్రదీప్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజల దాహార్తిని తీర్చారు. కార్యక్రమంలో అర్జున్ భూపతి, తాళబత్తుల పైడిరాజు, తమ్మినేని శ్రీనివాసరావు, కాకర్ల బాబాజీ, జనసైనికులు,గ్రామస్థులు పాల్గొన్నారు.





స్థానిక 21 డివిజన్ బాకర్‌సాహెబ్‌పేట, శ్రీచైతన్య కాలేజ్ రోడ్‌లో బూత్ ఇన్‌చార్జ లొట్టి సూరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ ప్రసాద్ దొర తదితరులు పాల్గొన్నారు. -సత్యంన్యూస్, శ్రీకాకుళం



అమెరికా పర్యటనలో భాగంగా రాష్ట్ర పీయూసి చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం సెంట్రల్ డిజిటల్ లైబ్రరీని సందర్శిస్తున్న దృశ్యం - సత్యంన్యూస్, ఆమదాలవలస

## ఐతమ్‌లో 23 నుంచి సాహితీ పోటీలు

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలిలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (ఐతమ్) కళాశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి లిట్ ఫెస్ట్ పేరుతో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థుల్లో సాహిత్య సృజనను వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయని ఆయన అన్నారు. ఫ్లాష్ ఫిక్షన్ (200-300 పదాలు), స్క్రీన్‌రైటింగ్ (చిన్న స్క్రీన్‌ప్లే), లిటరేచర్ క్విజ్, ఫిల్మ్ రివ్యూ ఛాలెంజ్ (5 నిమిషాల సమీక్ష), డ్రమటిక్ పెర్ఫార్మెన్స్ (నటన లేదా కవిత్వ పఠనం), కవితా రచన తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ఈ పోటీల్లో ఎంపిక చేసిన అంశాలను డీవోఐ, ఐఎస్‌బీఎన్ నంబర్లతో అధ్యయన పుస్తకాన్ని ప్రచురిస్తారని, విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతులు డాక్టర్ రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్యలతో పాటు డాక్టర్ పాపినాయుడు, నడిమింటి శైలజలు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాల్గొనవచ్చని నాగేశ్వరరావు సూచించారు.

## హోమియోతో సర్వవ్యాధి నివారణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఒత్తిడి, ఆందోళన లేకుండా ఆనందంగా జీవించడానికి హోమియో వైద్యం ఒక్కటే ఉపకరిస్తుందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీగుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, గుడ్ల జగ్గారావులు అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ హోమియో దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడి, ఆందోళనతోనే జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. దానివల్ల అనేకరకాల వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. దీన్నుంచి బయటపడటానికి హోమియో వైద్యం ఒక్కటే శరణ్యమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఒక్క హోమియోతోనే నయమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మి, అడపా శాంతి, వానపల్లి జ్యోతి, ఎన్.ఉపేంద్ర, ఎం.మల్లిబాబు, నంధిగాన కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## కిడ్నీ బాధిత బాలుడికి రూ.10వేల సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిన్నతనంలోనే రెండు కిడ్నీలు పోడవటం బాధాకరమని శ్రీకాకుళానికి చెందిన జూహిత్ నందన్‌క్రిష్ణ ట్రస్ట్ అధ్యక్షుడు గోపాల్ ఉర్లాన అన్నారు. బాధిత బాలుడి కుటుంబానికి గురువారం ఆయన రూ.10వేల సాయం అందించారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గొర్ల గణేష్ (14) అనారోగ్యం బారిన పడటంతో తల్లిదండ్రులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలుడికి రెండు కిడ్నీలు పని చేయడంలేదని చెప్పడంతో హతాశులయ్యారు. పేదలైన ఆ తల్లిదండ్రులు కుమారుడికి చికిత్స చేసేందుకు ఆర్థికస్తోమత లేక అవస్థలు పడుతున్నారు. ఈ సమాచారాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ ద్వారా తెలుసుకున్న గోపాల్ తమకు చెందిన జూహిత్ నందన్‌క్రిష్ణ టస్ట్ నుంచి రూ.10వేలు అందజేశారు. బాలునికి సహాయం చేయాలనుకునేవారు బాలుని తండ్రి గొర్ల పైడిరాజుకు ఫోన్‌పే (9573834700) ద్వారా సహాయమందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన అల్లంశెట్టి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం బాలుడికి వైద్యశాలలో డయాలసిస్ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్లాం శివతేజ, తదితరులు పాల్గొన్నారు.




## ఛూ.. ఇదేంపాట అన్నారు..

# కట్ చేస్తే.. ఇండస్ట్రీ హిట్!

తెలుగు చిత్ర పరిశ్రమకి ఇళయరాజా అప్పుడప్పుడే పరిచయం అవుతున్న రోజులు. కెఎస్. రామారావు అంతకు ముందు తమిళ్ డబ్బింగులు చేసి ఉండటం వల్ల తన తొలి స్ట్రెయిట్ తెలుగు సినిమాకి ఇళయరాజాని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెట్టుకున్నాడు. సత్యానంద్ మాటలు. లోక్‌సింగ్ కెమెరా.. రాజా, కోదండరామిరెడ్డి, చిరంజీవి.. మొత్తం ఐదుగురు కాంబినేషన్లో ఐదు సినిమాలు చేద్దామనుకొని ఒక అగ్రిమెంట్. అలా వచ్చినవే చాలెంజ్, రాక్షసుడు వగైరా. ఆ వరుసలో అభిలాష మొదటిది.

**యండమూరి వీరేంద్రనాథ్**

ఈ సినిమాకి కో- డైరెక్టర్ అజయ్‌కుమార్. అతడు మద్రాసులో సాంగ్ రికార్డింగ్ దగ్గర ఉన్నాడు. విశాఖపట్నంలో షూటింగ్ జరుగుతోంది. మరుసటి రోజు సాంగ్ షూట్. ఇప్పుడున్నంత ఆధునిక టెక్నాలజీ అప్పుడు లేదు. ముందు రోజు మెద్రాస్ నుంచి అజయ్ కుమార్ పాట తాలూకు రీల్ తీసుకొచ్చాడు. అందరూ గుండ్రంగా కూర్చుని ఉత్సాహంగా, ఆసక్తిగా విన్నారు. పాట చాలా నత్తనడకల ఆలాపనతో మొదలైంది. అప్పటికి అందరూ చక్రవర్తి మ్యూజిక్ డైరెక్షన్‌కి అలవాటు పడ్డవారు. పెద్ద పెద్ద సౌండ్లు.. హడావుడి..! అందరి మొహాలు పాలిపోయాయి.. ఏదో గిరిజన సంగీతంలా ఉందన్నారు ఒకరు. 'ఇదేమిటి? ఇదెలా..చిరంజీవి మీద ఈ పాటా?' లాంటి గుసగుసలు. డాన్స్ డైరెక్టర్ తారా మాస్టర్ "దీనికి డాన్స్ కంపోజిషన్ ఎలా చేయాలి?" అంటూ పెదవి విరిచింది. రామారావుక్కూడా పాట నిరాశాజనకంగానే ఉన్నట్టు అనిపించింది కానీ మరుసటి రోజు షూటింగ్. క్యాన్సిల్ చేస్తే లక్షల్లో నష్టం. కాబట్టి రకరకాల కోణాల్లో ఆలోచిస్తూ ఉండిపోయాడు. సినిమా అందరికీ ప్రెస్టేజి. అంత స్లో సాంగ్‌ని మాస్‌హీరో చిరంజీవి మీద ఎలా చిత్రీకరణ చేయాలి అని కోదండరామిరెడ్డి కూడా అటు ఇటుగా ఊగాడు. అయితే సాయంత్రానికి అతడు ఒక నిర్ణయానికి వచ్చి 'వినగా వినగా బావున్నట్టుంది. చేసేద్దాంలే' అన్నాడు. రామారావు 'హమ్మయ్య' అనుకున్నాడు. మొదటి నుంచీ అతడు కాస్త కాన్ఫిడెంట్ గానే ఉన్నాడు.

ఆ మరుసటి రోజు షూటింగ్ ప్రారంభమైంది. అంతే..! సాయంత్రానికల్లా లైట్- బోయ్ ల దగ్గర నుంచి మొత్తం యూనిట్ అందరి నోటా వేటూరి పాట "బంతీ.. చామంతీ.." అంటూ కంటిన్యూయస్‌గా ఆ పల్లవి రిపీట్ అవుతూ ఉండటంతో, సాంగ్ సూపర్ హిట్ అవుతుందని నమ్మకం కుదిరింది.

ఆపై 'అభిలాష' విజయవంతం కావటానికి వెనక ఉన్న కొన్ని కారణాల్లో ఈ పాట ఒకటిగా నిలిచింది.



**మార్పు మొదట నిర్ద్వంద్వంగా నిరాకరింపబడుతుంది. ఆపై తూట్లు తూట్లుగా విమర్శించబడుతుంది. ఆ తరువాత ఒప్పుకోబడుతుంది.**

**సాయంకాలం సాగర తీరం, జయ జయ జయ ప్రియ భారత జనయత్రీ దివ్యధాత్రి, సందెపొద్దుల కాడ, శుభలేఖ వ్రాసుకున్నా, ఉరకలై గోదావరి, మళ్లీ మళ్లీ ఇది రానిరోజు, కరిగిపోయాను కర్పూర వీణలా లాంటి ఆ పై వచ్చిన పాటలన్నీ కోదండరామిరెడ్డి ఆ మహానుభావుడి చేత ఏరి కోరి, కోరి కోరి చేయించుకున్నాడు. (ఈ క్రింది ఫోటో అభిలాష తొలిపాట ఆత్రేయ గారిది.. 'వేళాపాళ లేదు కుర్రాళ్ళాటకు')**

# సింపుల్‌గానే హీటెక్కించేసింది!!



ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే నటీమణుల్లో జ్యోతి పూర్వాజ్ ఒకరు. నటిగా మాత్రమే కాకుండా, సోషల్ మీడియాలో గ్లామర్ ఫొటోషూట్లతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమె తాజా ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. రెస్టారెంట్‌లో కాఫీ లేదా వాటర్ గ్లాస్‌తో ముస్తాబైన ఈ ఫోటోషూట్ చాలా స్టైలిష్‌గా, ఫ్రెష్‌గా కనిపిస్తోంది. ఈ ఫోటోలలో జ్యోతి మరీ అందంగా మెరిసిపోయింది. రెడ్ 'వి' నెక్ టాప్, ఓపెన్ హెయిర్ స్టైల్, లైట్ మేకప్‌లో ఆమె లుక్ చాలా ఆకట్టుకుంటోంది. కళ్లలో వున్న సాఫ్ట్ ఎక్స్‌ప్రెషన్స్, స్మైలింగ్ ఆమె సౌందర్యాన్ని మరింత మెరిపించాయి. ముఖ్యంగా ఆమె నాచురల్ బ్యూటీకి సోషల్ మీడియా యూజర్లు ఫిదా అవుతున్నారు. ఇటీవల జ్యోతి పూర్వాజ్ కొన్ని టీవీ షోస్, యూట్యూబ్ ఇంటర్వ్యూల ద్వారా పాపులర్ అయింది. ఇప్పటికే కొన్ని చిత్రాల్లో సపోర్టింగ్ రోల్స్ చేసిందామె. అయితే మోడలింగ్, గ్లామర్ ఫొటోషూట్ల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు ఆమె వెబ్ సిరీస్‌లు, ఓటీటీ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో జ్యోతి పూర్వాజ్‌కి ఫాలోయింగ్ భారీగానే ఉంది. ప్రతి ఫోటోపోస్ట్‌కు వేలల్లో లైక్స్, వందలలో కామెంట్స్ వస్తుండటంతో ఆమె క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. తన అందాన్ని బోల్డ్‌గా, కాన్ఫిడెంట్‌గా ప్రెజెంట్ చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోలు చూస్తుంటే.. ఆమె కెరీర్ కొత్త దిశలో సాగుతుందని, మరిన్ని అవకాశాలు ఆమె కోసం ఎదురుచూస్తున్నాయన్న నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. సింపుల్ కానీ స్టైలిష్ లుక్స్‌లో కనిపిస్తున్న జ్యోతి, నటనతో పాటు గ్లామర్ ఆటిట్యూడ్ తో కూడా అలరిస్తోంది. త్వరలోనే ఓటీటీలు లేదా మ్యూజిక్ వీడియోల ద్వారా మరింతగా ప్రేక్షకుల మన్ననలు పొందే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. -తుపాకి.కామ్ సౌజన్యంతో...



అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ వై.భద్రాజీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఇప్పిలి కాశ్యప శర్మ, బంకుపల్లి రమేష్ శర్మ, భాస్కరభట్ల నరసయ్య శర్మ, ఫణీంద్రశర్మ, రంజిత్‌శర్మ, పెంట శ్రీనివాస శర్మ, రంప సాయి అవధాని, ఆరవెల్లి శ్రీరామశర్మ, జాడ సూర్యనారాయణ శర్మ, వెంకటరమణ శర్మ, అంపోలు రుద్ర కోటేశ్వర శర్మ, వేమకోటి సూర్యనారాయణ శర్మ, శ్రీరామమూర్తి శర్మ, పులకండ శ్రీనివాస శర్మ, సూర్యనారాయణ శర్మ, సాయి కుమార్ శర్మ, చంద్రశేఖర్ శర్మ, కిరణ్ మహర్షి శర్మ, హరి శర్మ, సందీప్ శర్మ, శ్రీనివాస చక్రవర్తి, రామకృష్ణశర్మ, ఆలయ అర్చకులకు, వేద పండితులకు, నాయిబ్రాహ్మణులకు సత్కరించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## కొయ్యాం కళాశాలలో నోట్ బుక్స్ పంపిణీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కొయ్యాంలో.. గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా పేరిట నోట్ బుక్స్‌ను ప్రభుత్వం జిల్లా కేంద్రంకు చేరవేసింది. అక్కడ నుండి అధికారులు సర్కారీ కళాశాలలకు వాహనాల్లో అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు విద్యార్థి మిత్రా నోట్ బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఎంతో వరమని పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని బాలబాలికలకు సూచించారు. ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా విద్యార్థులకు అందజేస్తున్నట్టు ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు వెల్లడి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సనపల షణ్ముఖరావు, నడిమింటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



## నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకాయి

**- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వంటగ్యాస్ ధరలు పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాన్యుల ఇంట్లో మంట పెట్టిందని మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి విమర్శించారు. కేంద్ర రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని అన్నారు. ఇది చాలదన్నట్లు వంట గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి రూ.50 పెంచడం దారుణమని, దాన్ని వెంటనే తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారం చేజిక్కగానే పేద, మధ్య తరగతి నడ్డి విరిచేలా భారం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు అవుతున్నా ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు కల్పించలేదని నిలదీశారు. ప్రజలను మోసం చేయటం సీఎం చంద్రబాబుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదన్నారు. వైఎస్‌జగన్ హయాంలో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి.. తూచా తప్పకుండా అమలు చేశామని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి అయిన జగన్‌కు పర్యటనల సమయంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం దారుణమని రెడ్డి శాంతి విమర్శించారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## జిల్లా వైద్యాధికారిగా సుజాత

**- ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ బి సుజాతకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె విశాఖలోని ఫిమేల్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్స్‌పల్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్యధికారిగా విధులు నిర్వహిస్తూ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడి సస్పెండ్‌కు గురైన బాల మురళీకృష్ణ స్థానంలో డాక్టర్ సుజాతకు అదనపు బాధ్యతలు అప్పగించారు.డాక్టర్ సుజాత గతంలో పాతర్లపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం విశాఖ ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జ్ ఆర్డీగా పనిచేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వెనుకబడిన కులాలకు, షెడ్యూల్ కులాలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలని రుణాలు మంజూరు, వసతి గృహాలు నిర్వహణ, పూర్తిస్థాయిలో జరగాలని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం బీసీ కార్పోరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి బీసీ సంక్షేమ అధికారులు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు బిసి కార్పొరేషన్ ఆఫీసర్లు ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ బీసీ ఎస్సీ రుణాలు అర్హులైన వారికి న్యాయంగా అందించాలని, మరి ఆర్థిక పురోభివృద్ధి కి సహకరించే విధంగా జరగాలన్నారు. బీసీ వసతి గృహాలు, ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరిస్థితులు కల్పించాలని, ఇటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ చేయాలని అన్నారు. పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉండి విద్య నేర్చుకుంటున్నారని అటువంటి విద్యార్థి విద్యార్థులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు రుణాల విషయంలో కూడా అర్హులైన వారిని గుర్తించి రుణాలు మంజూరు చేయాలని నాలుగు శాఖల అధికారులకు సూచించారు.



## “ఊయల” కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



(సత్యంన్యూస్, రణస్థలం)

స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, ఐ.సి.డి.యస్.ప్రాజెక్ట్ రణస్థలం సి.డి.పి.ఓ సీహెచ్. ఝాన్సీ ఆద్వర్యంలో మండలంలోని కొండములగాం పీహెచ్‌సీలో గురువారం “ఊయల” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆడపిల్లలు, అనారోగ్యవంతులు, అంగవైకల్యం కలవారు, అవాంచిత గర్భం వలన పుట్టిన పసిపిల్లలను వద్దనుకుని వారిని చెత్త కుండీలు, ముళ్ళ పొదలు లేదా బయట చాలామంది పారవేస్తున్నారన్నారు. ఇటువంటివి తలెత్తకుండా ఈ“ఊయల” కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అటువంటి వారిని ఈ ఊయలలో వేస్తే వారిని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారు శిశు గృహంలో ఉంచి వారిని సంరక్షిస్తారన్నారు. పిల్లల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి చట్టబద్ధంగా దత్తత ఇస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గల బాలింతలను పరామర్శించి పండ్లను పంపిణీ చేశారు. పసిపిల్లలకు 6నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. వాటి వలన కలిగే ఉపయోగాలను ఎమ్మెల్యే వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పిసిని జగన్నాధం నాయుడు, దన్నాన సత్తిబాబు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్, హాస్పటిల్ డైరెక్టర్ దన్నాన స్వామి నాయుడు , ఎంపిటిసి దన్నాన వంశీ, దన్నాన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

(సత్యంన్యూస్, పాతపట్నం)

నిరుద్యోగులైన యువతీయువకులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. గురువారం పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలో నైపుణ్యం ఉన్నత విద్య అభ్యసించినప్పటికి నిరుద్యోగులు వేలాది సంఖ్యలో ఉన్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తుందన్నారు. ఇటువంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకొని యువతీ యువకులు ఆయా పరిశ్రమంలో ఉద్యోగం సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. వెనుకబడిన నియోజకవర్గంలో ఇటువంటి జాబ్ మేళాలు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. అరబిందో, అపోలో, టైర్స్, తోపాటు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. పాతపట్నం, మెలియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేటతో పాటు పలు గ్రామాల నుంచి సుమారు 650మంది యువకులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. ఆసక్తి ఉన్న ఉద్యోగంలో వారు చేరాలని యువతకు మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయి,ఎంప్లాయిమెంట్ అధికారిణి సుధారాణి, సెట్‌సీఈవో ప్రసాద్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






కేంద్ర పార్టీ పిలుపు మేరకు, దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న “పల్లెకు పోదాం” కార్యక్రమంలో భాగంగా బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు గురువారం రూరల్ మండలం రాగోలు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షుడు రుప్ప బాలకృష్ణ, సీనియర్ నాయకుడు భైరి అప్పారావు, మండల ఉపాధ్యక్షులు మూకళ్ళ లక్ష్మీనారాయణ, పోలింగ్ బూత్ అధ్యక్షుడు చల్లా గోవిందరావులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

## సీసీ కెమెరాల ఏర్పాటు

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఇటీవలే ఆలయాలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై ఆలీ తెలిపారు. ఈమేరకు గురువారం చర్చిలు, ఆలయాలు, ప్రధాన కూడళ్లను సందర్శించి ఏయే ప్రాంతాల్లో సీసీ కెమెరాల అవసరం ఉన్నాయో పరిశీలించి అక్కడ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు, చర్చిలపై దాడులు చేయకూడదన్నారు. ఇటువంటి దాడులు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు నిఘా పెట్టి అటువంటి వారిపై దృష్టి సారిస్తామని తెలిపారు.



## వచ్చే ఎన్నికలకు యూత్ కమిటీ కీలకం కావాలి

**- కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలి**

**- రాబోయే జగనన్న ప్రభుత్వమే**

**- పార్టీ కోసం పనిచేసే వారికి ఈసారి పట్టాభిషేకమే**

**- యువజన విభాగం గ్రామస్థాయిలో ప్రతిష్ట పరిచే బాధ్యత మండల కమిటీలదే**

**- వైకాపా యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య**

(సత్యంన్యూస్, నరసన్నపేట)

వచ్చే ఎన్నికల నాటికి గ్రామస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యువజన విభాగం కీలకం కావాలని నరసన్నపేట నియోజకవర్గం వైసిపి యువ నాయకులు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. గురువారం నరసన్నపేట వైకాపా కార్యాలయంలో జరిగిన నాలుగు మండలాల యువజన విభాగం కమిటీల పరిచయ అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వ్యవహరించి యూత్ కమిటీలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుందని, కానీ ప్రజలకు ఇచ్చినటువంటి వాగ్దానాలు అమలు పరచడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందన్న విషయాన్ని గ్రామస్థాయిలో జనాలకు వివరించాల్సిన అవసరం యూత్ కమిటీ లా పైనే ఉందన్నారు. గతంలో జగనన్న ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని.. ఎన్నికలు ఎప్పుడు పెట్టిన రాబోయేది జగనన్న ప్రభుత్వమేఅని అన్నారు. ఈసారి పనిచేసే కార్యకర్తలకు పట్టంకట్టే విధంగా పాలన ఉండబోతుందని స్వయంగా జగనన్నే చెప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గం, మండల కమిటీలు అనుసంధానమై గ్రామ స్థాయిలో యువజన విభాగం ప్రతిష్ట పరిచేందుకు నడుం కట్టాలని, పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి యూత్‌కమిటీ సభ్యులు పని చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల యూత్ కమిటీ అధ్యక్షులను, ఉపాధ్యక్షులను, సెక్రటరీలను, ఎగ్జిక్యూటివ్ సభ్యులను పరిచయం చేసుకొని, దుస్సాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యూత్ కమిటీ అధ్యక్షులు దండి జయప్రకాష్, నరసన్నపేట మండలం యువజన విభాగం అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, జలుమూరు మండలం యూత్ కమిటీ అధ్యక్షులు జుత్తు నేతాజీ, పోలాకి మండలం యూత్ కమిటీ అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు, సారవకోట యూత్ కమిటీ అధ్యక్షులు కొండాల బాబురావు తోపాటు కమిటీ సభ్యులు అందరూ హాజరయ్యారు.




## బందరువానిపేట ఎమ్మెల్యే పల్లెనిద్ర

(సత్యంన్యూస్, గార)



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పల్లెనిద్ర కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా గార మండలం బందరువానిపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి శనివారం ఉదయం పది గంటల వరకు గడుపుతారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, స్థానిక ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

## విధి నిర్వహణలో హోంగార్డు మృతి

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)



విధి నిర్వహణలో ఉన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ కానిస్టేబుల్ తెలంగాణలోని హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మరణించాడు. సరుబుజ్జిలి మండలం చిగురువలస గ్రామానికి చెందిన నల్లాన సింహాచలం హైదరాబాద్‌లో హెూంగార్డుగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా మియాపూర్ జంక్షన్‌లో మంగళవారం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తుంగా నిబంధనలకు విరుద్ధంగా అతివేగంగా వచ్చిన ఒక లారీ అక్కడున్న పోలీసులను ఢీకొట్టింది. ఈ ఘటనలో సింహాచలంతోపాటు ముగ్గురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666



# అడవి బిడ్డల వైద్యానికి ఆర్థిక ఆసరా!

-సీతంపేట ఏజెన్సీలో సికిల్‌సెల్ ఎనీమియా జోరు

-దాని బారిన పెద్దసంఖ్యలో గిరిజనులు

-ప్రభుత్వ పింఛన్‌కు అవకాశమున్నా అందుకోలేని దైన్యం

-కేజీహెచ్ వైద్యులనే ఇక్కడికి రప్పించిన ఐటీడీఏ పీవో చొరవ

-ఇక్కడే పరీక్షలు చేసి.. ధ్రువపత్రాల జారీ

-త్వరలోనే పింఛన్లు అందుకోనున్న వందమందికిపైగా బాధితులు

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

వారు అక్షరజ్ఞానం పెద్దగా లేని గిరిజనులు. వైద్య పరిజ్ఞానం గానీ, ఆరోగ్య సమస్యలపై గానీ అవగాహన అసలే లేని అడవి పుత్రులు. శారీరక సమస్యలు వేధిస్తున్నా అంతవేగంగా ఆస్పత్రులకు వెళ్లడానికి ఇష్టపడకుండా.. అడవిలో దొరికే మూలికలతోనే కాలక్షేపం చేస్తుంటారు. ఫలితంగా గిరిజన గూడేల్లో సికిల్‌సెల్ ఏనీమియా చాలా ఏళ్లుగా ప్రబలుతోంది. దీనికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించడంతోపాటు బాధితులకు నెలకు రూ.పదివేల పింఛన్ సౌకర్యం కల్పించినా దీనికి అవసరమైన ధ్రువపత్రం పొందడమే గిరిజనులకు పెద్ద ప్రహసనంలా ఉండటంతో మెజారిటీ బాధితులు వాటికి దూరంగా ఉండిపోతున్నారు. అయితే ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి చొరవతో ఎనీమియా బాధితులకు సులభంగా ధ్రువపత్రాలు అందించేందుకు మార్గం సుగమమైంది.

**కేజీహెచ్‌కు వెళ్లలేక..**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీ పరిధిలో గిరిజనులను పీడిస్తున్న తీవ్రమైన వ్యాధుల్లో సికిల్‌సెల్ ఎనీమియా ముఖ్యమైనది. ఈ వ్యాధి బారిన పడినవారు రక్తహీనతతో బాధపడుతుంటారు. రోజురోజుకు శరీరంలో రక్తం తగ్గిపోవడం, నీరసించిపోవడం, తరచూ కళ్లు తిరిగి పడిపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి నిర్మూలనకు సరైన చికిత్సా విధానం లేకపోవడం వల్ల చాలామంది రోగులు మరణాలకు గురవుతుంటారు. అందువల్ల వ్యాధి సోకినవారు నిరంతరం వైద్య చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది. దీనికి చాలా డబ్బు ఖర్చవుతుంది. అయితే అడవులపై ఆధారపడే నిరుపేదలైన గిరిజనులు ఆర్థిక స్తోమత లేక, పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేక ఎనీమియా బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వీరి దుస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వైద్యఖర్చుల కోసం బాధితులకు ప్రతినెలా రూ.10వేల పింఛను అందించడం ప్రారంభించింది. అయితే ఈ పింఛను అందుకోవడానికి నిబంధనలు అడ్డంకిగా మారాయి. సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్లు వైద్యాధికారులు ఇచ్చే పాజిటివ్ ధ్రువపత్రం సమర్పించిన వారికే ఈ పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు ధ్రువపత్రం పొందాలంటే బాధితులు విశాఖ నగరంలోని కేజీహెచ్(కింగ్ జార్జ్ ఆస్పత్రి)కు వెళ్లి హెచ్‌బీఎల్‌సీ అనే పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది. ఇదే గిరిజనులను వెనక్కి లాగుతోంది. మారుమూల గిరిజన గ్రామాల నుంచి విశాఖపట్నం వెళ్లి అక్కడ రెండు, మూడురోజులు ఉండి పరీక్షలు చేయించుకుని ధ్రువపత్రం పొందడం తీవ్ర వ్యయప్రయాసలతో కూడినదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లే చాలామంది రోగులు విశాఖ వెళ్లలేక మొత్తంగా ఈ సౌకర్యానికే దూరమవుతున్నారు.





## ఐటీడీఏలోనే పరీక్షలు



గిరిజనులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను క్షేత్రస్థాయి పర్యటనలు, పరిశీలనల్లో సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి(పీవో) యశ్వంత్‌కుమార్ రెడ్డి గుర్తించి ఆవేదన చెందారు. దీనికి ఒక పరిష్కారమార్గం చూపించాలన్న ఉద్దేశంతో విశాఖ కేజీహెచ్ వైద్యాధికారులతో మాట్లాడారు. తత్ఫలితంగా ఇంత వరకు కేజీహెచ్‌లో మాత్రమే నిర్వహిస్తున్న హెచ్‌బీఎల్‌సీ పరీక్షలను సీతంపేట ఐటీడీఏలోనే నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. ఆ మేరకు ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీ కేంద్రంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మూరుమూల గూడేల్లో ఉండే గిరిజనులు ప్రతివారం ఐటీడీఏలో జరిగే గ్రీవెన్స్‌కు అలాగే సంతకు తరలి వస్తుంటారు. అప్పుడే ఎనీమియాతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కలగడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## తొలివిడతలోనే 110 మందికి



మొదట అన్ని గిరిజన గ్రామాలు, గిరిజన ఆశ్రమ పాఠశాల్లో 0-40 ఏళ్ల మధ్య వయస్సున్న లక్షా 24 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి 225 మందిలో సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వారందరినీ ఐటీడీఏ అంబులెన్సులు, ఇతర వాహనాల్లో గత డిసెంబర్ మూడో తేదీన ఐటీడీఏలోని వైటీసీ కేంద్రానికి తరలించారు. కేజీహెచ్ నుంచి వచ్చిన వైద్యబృందం ఆధ్వర్యంలో హెచ్‌బీఎల్‌సీ పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో 110 మందికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. ఆ మేరకు వారికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. వాటి ఆధారంగా ఐటీడీఏ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యాధికారులే బాధితుల తరఫున పింఛన్ దరఖాస్తులు నింపి సంతకాలు చేసి ఐటీడీఏకు పంపించాలని పీవో ఆదేశాలు జారీ చేశారు. ఐటీడీఏకు అందిన ఆ దరఖాస్తులను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల డీఎంహెచ్‌వో కార్యాలయాలకు పంపి వాటిని త్వరతగతిన పరిశీలించి పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పుడు ఆ ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యింది. పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి చొరవతో ఎన్నో ఏళ్లుగా సాయం అందుకోలేకపోతున్న గిరిజన బాధితులు త్వరలోనే పింఛన్లు అందుకోబోతున్నారు. దీనికి సంబంధించి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు ఎట్టకేలకు పింఛన్లు అందించగలిగినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఇకముందు కూడా తరచూ ఇటువంటి శిబిరాలు నిర్వహించి ధ్రువపత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

# ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కలెక్టరు కార్యాలయం దగ్గరలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్/డిగ్రీ చదివి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులు, సుమారు 2నెలల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. శిక్షణార్థులకు మధ్యాహ్న భోజనం, శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7893227705 కు సంప్రదించాలని కోరారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి



(సత్యంన్యూస్, కొత్తూరు)

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ముఖంలో సంతోషం చూడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నార్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో అర్హులైన దివ్యాంగులకు గురువారం ఉచిత ట్రైసైకిల్‌ను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను మన దగ్గర అమలు చేస్తున్నారన్నారు. దివ్యాంగులందరికీ రూ.6వేలు పెన్షన్ ఇస్తూ ముఖ్యమంత్రి చేయూతనిస్తున్నారన్నారు. అంతేకాకుండా వారికి ఉపాధి, ఉపకరణాలు అందిస్తూ తోడ్పాటునందిస్తున్నారన్నారు. దివ్యాంగులకు విద్యలో రిజర్వేషన్లు ఇచ్చి, ఆర్థిక పథకాల్లో కూడా ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో దివ్యాంగులతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


VIDWATH IIT & NEET ACADEMY

డోర్ నెం : 16-11-45, విజయ ఆదిత్య పార్క్ ఎదురుగా, సనపలవానిపేట, NH-16 ప్రక్కన, శ్రీకాకుళం.

8074580974, 8328383043, 91826 49534, 6361448622

తల్లి దండ్రులు, విద్యార్థుల కలల సాకారానికి ఒక విశ్వసనీయ భాగస్వామి - విద్వత్ మన శ్రీకాకుళంలో

ADMISSIONS OPEN 2025 - 26

STRESS FREE EDUCATION IN A STUDENT FRIENDLY ENVIRONMENT

Girls Campus Siri Bhavan

Boys Campus Medha Bhavan

బెంగుళూరు, చెన్నై, కోట, కోయంబత్తూర్

ఈ నగరాలలోని ప్రసిద్ధ సంస్థలలో పనిచేసిన "Expert Faculty" లచే నిరంతర శిక్షణ

Maths Madhu Sir | Physics Naresh Sir | Chemistry Prasad Sir | Botany Eswar Prasad Sir | Zoology Praveen Sir

Daily Practice Papers


# వైభవంగా షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



(సత్యంన్యూస్, గార)

మండలంలోని బూరవెల్లి గ్రామంలో గల షిర్డీసాయిబాబా ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం బాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేకపూజలు, విశేష పుష్పాలంకరణ సేవ, భక్తుల దర్శనాలు నిర్వహించారు. అనంతరం బాబా వారి అన్న ప్రసాద వితరణ పెద్ద ఎత్తున జరిపారు. సాయంత్రం బాబా పల్లకీసేవ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పోలాకి మండలం బొద్దాం పంచాయతీ రైతుల సమస్యలపై స్థానిక తాసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించి తగినచర్యలు తీసుకోవాలని పోలాకి జెడ్పీటీసీ, వైకాపా యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య కోరారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, నరసన్నపేట**



చిలకపాలెంలోని శివాని గ్రూప్ ఆఫ్ కాలేజీ విద్యార్థులతో శక్తి యాప్, మహిళలు, పిల్లల భద్రతపై గురువారం స్థానిక పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వీయ-భేదం, సైబర్ నేరాలపై వివరించారు. కార్యమ్రకంలో ఎస్‌ఐ రవితో పాటు శక్తి టీమ్ సభ్యులు, కాలేజీ యాజమాన్య ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, ఎచ్చెర్ల**

# అక్రమాల అభ్యాసన!

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించారు. ఈ ఏడాది జనవరి 10, 27 తేదీల్లో జారీ చేసిన రెండు జీవోల ద్వారా జిల్లాస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జనవరి పదో తేదీన జారీ చేసిన జీవో ప్రకారం పాల్ ల్యాబ్‌ల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ఒక కమిటీని నియమించాల్సి ఉంటుంది. జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) అధ్యక్షుడిగా ఉండే ఈ కమిటీకి సమగ్రశిక్ష ఏపీసీ(అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఉప విద్యాశాఖాధికారులు, జిల్లా ట్యాబ్ ఇన్‌ఛార్జీలు సభ్యులుగా ఉంటారు. అలాగే సమగ్రశిక్ష అధికారులు నామినేట్ చేసిన ఏఎస్‌వో లేదా ఏపీవోలు సభ్యులుగా, పాల్ ల్యాబ్‌లకు డీఎన్‌వోలుగా వ్యవహరిస్తారని ఈ జీవోలో పేర్కొన్నారు. కమిటీలోని సభ్యుల విధులు, బాధ్యతలను కూడా ఇదే జీవోలో స్పష్టంగా నిర్వచించారు. జనవరి 27న జారీ చేసిన రెండో జీవోలో పాల్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అవసరమైన రూముల ఏర్పాటు, వాటిలో సమకూర్చాల్సిన సౌకర్యాలు, మెటీరియల్ కొనుగోలు, రిపేర్లు తదితర అంశాలపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటికే కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేకంగా మళ్లీ పాల్ ల్యాబ్ ఏర్పాటు చేయనవసరం లేదని పేర్కొన్నారు. ల్యాబ్ ఏర్పాటుకు రూము సౌకర్యం లేని చోట్ల ఆరు సాకెట్స్ కలిగిన ఆరు స్పైక్స్ కొనుగోలు చేసి ట్యాబ్‌లను రీఛార్జ్ చేసేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. ఏ మెటీరియల్ ఎంత రేటుకు కొనాలన్నది కూడా ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇంత పక్కాగా జీవోలు ఉన్నా కూడా అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోవడమే విచారకరం.

**జిల్లాస్థాయిలోనే అక్రమాలు**

పాల్ ల్యాబ్‌లకు అవసరమైన ఎలక్ట్రికల్, ఇతర కొనుగోళ్లను తమ అవసరాలను బట్టి కొనుగోలు చేసుకునేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపళ్లను ఆదేశించాలని సమగ్రశిక్ష జనవరి 27న జారీ చేసిన జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.22,500 మంజూరు చేశారు. ఇందులో రూ.19,500 మెటీరియల్ కొనుగోలుకు, మిగిలిన రూ.మూడు వేలు ల్యాబ్‌లు ఏర్పాటు చేసే గదుల్లో అవసరమైన చిన్నచిన్న మరమ్మతులకు వెచ్చించాలని సూచించారు. జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ గానీ, ఇతర జిల్లా అధికారులు గానీ వీటిని కొనుగోలు చేయాలని ఎక్కడా చెప్పలేదు. కానీ శ్రీకాకుళం జిల్లాలో మాత్రం అదే జరిగింది. పాఠశాలలకే ఇవ్వాల్సిన కొనుగోలు బాధ్యతలను జిల్లా స్థాయిలో కొందరు లాక్కుని అక్రమాలకు తెర తీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 54 రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తుండగా వీటన్నింటి తరఫున ఏకమొత్తంగా మెటీరియల్ కొనుగోలు చేసే పెత్తనాన్ని సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణ్ తీసుకున్నట్లు తెలిసింది. అది కూడా కొటేషన్లు వంటి ప్రొసీజర్లు అనుసరించకుండా శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ సమీపంలో ఉన్న ఒక చిన్న షాపు నుంచి మొత్తం మెటీరియల్ కొన్నారని అంటున్నారు. ఈ వ్యవహారంలో కమీషన్లు చేతులు మారాయని అలాగే తక్కువ రేటుకు కొని ప్రభుత్వ జీవోలో సూచించిన రేట్లకు బిల్లులు సిద్ధం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో నాసిరకం మెటీరియల్ కొన్నారన్న, తక్కువ మెటీరియల్ కొనుగోలు చేసి దాన్నే పాఠశాలలకు సరఫరా చేసి సర్దుకోమని చెప్పారని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్ని రకాలుగా చిలక్కొట్టుడుకు పాల్పడిన అక్రమార్కులు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెరగకుండా దెబ్బకొడుతున్నారు. ఇచ్ఛాపురంలో ఉన్న పాఠశాలకు శ్రీకాకుళంలో వైర్లు, స్విచ్‌లు కొని పంపడానికే తడిపి మోపెడవుతుంది కదా.. అటువంటప్పుడు ఇక్కడ కొనుగోలు చేసి శశిభూషణ్ ఏం సంపాదిస్తారన్న అనుమానం కలగొచ్చు. కానీ ఈ మెటీరియల్‌ను తరలించడానికి ఆయన సర్వశిక్ష వాహనాలనే వాడుకుంటున్నట్టు తెలుస్తుంది. బైజూస్ సంస్థ నుంచి పని చేస్తున్న వ్యక్తి సహకారంతో ఈ పాల్ ల్యాబ్‌లలో కమీషన్ల పాలు పిండుకున్నారని ఆరోపణలైతే ఉన్నాయి. ఎందుకంటే.. శశిభూషణ్‌ది మొదట్నుంచీ కమర్షియల్ ఫార్ములానే డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా ఉన్నప్పుడు కూడా తన సబ్జెక్టుకు సంబంధించిన గైడ్‌లు తయారుచేసి వాటినే విద్యార్థులు కొనాలని సూచించి, ఆ మేరకు మంచి వ్యాపారమే చేసేవారు ఇప్పుడు సమగ్రశిక్షకు వెళ్లిన తర్వాత కూడా తన పాత బిజినెస్‌ను వదులుకోలేదు సరికదా.. కొత్త బిజినెస్‌కు తెర లేపినట్లు తెలుస్తుంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.